క్లుప్తంగా

ఎన్నికల కోడ్ అమలు ఇలాగేనా..?



కొళ్లికూళ్ల(పెనుగంచిప్రోలు): మండలంలోని కొళ్లికూళ్ల గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎవరూ పట్టించుకోవటం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సెంటర్‌లో టీడీపీ జెండా దిమ్మెకు పార్టీ రంగులు, పేర్లు కనిపించకుండా చర్యలు తీసుకోలేదన్నారు. అనిగండ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా పసుపు రంగు వేసిన స్తంభాలు ఉన్నా పట్టించుకోవటం లేదన్నారు. తక్షణం అధికారులు స్పందించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు అంటే ఇలాగేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వెదురు చెట్లకు నిప్పు



కంచికచర్ల : ఓ సినిమా థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో వెదురు చెట్లకు ఆకతాయిలు నిప్పంటించగా స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మంటలను మంగళవారం ఆర్పివేశారు. ఫైర్‌అధికారి టీ శ్రీనివాసరావు కథనం మేరకు కంచికచర్లలోని శ్రీనివాస థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో వెదురు చెట్లు ఉన్నాయి. ఆకతాయిలు ఆ వెదురు చెట్లకు నిప్పంటించారు. పెద్ద పెద్ద మంటలు వ్యాపించటంతో స్థానికులు భయాందోళనకు గురై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



చందర్లపాడు(నందిగామ): ఎన్నికల సమయంలో అనవసరంగా వివాదాలకు పోయి ఇబ్బందులు పడవద్దని ఎస్‌ఐ ఆర్.ధర్మరాజు సూచించారు. మండలంలోని పాత బెల్లం కొండవారిపాలెంలో మంగళవారం రాత్రి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివాదాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములపల్లి(కంచికచర్ల): ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని నందిగామ ఎస్‌ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని వేములపల్లిలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ఓటర్లను ప్రలోభపెట్టినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు పాల్పడరాదని, రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తరలించినా సహించేది లేదని అన్నారు. ఇప్పటికే పోలీసులు, సాయుధ బలగాలు అన్ని గ్రామాల్లో కవాతు నిర్వహించాయని, సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించామని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ-2 హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

12 మంది జూదరులపై కేసు

జి.కొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న పన్నెండు మందిని జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ కుంట ముక్కల గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి, రూ.3,800 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా మునగపాడు గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,050 నగదును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని వివరించారు.

ఉత్సాహంగా ఉగాది వేడుకలు

- పలు చోట్ల పంచాంగ శ్రవణాలు
- ఆలయాల్లో విశేష పూజలు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీ క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు వివిధ ఆలయాలకు క్యూ కట్టారు. వ్యాపారులు ఈ ఏడాదంతా తమ వ్యాపారాలు బాగుండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ప్రతి ఆలయం ముందు, ఇళ్ల ముంగిట, దుకాణాలకు మామిడి తోరణాలు కట్టి నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలికారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. ప్రతి ఆలయంలో ఉగాది పచ్చడిని ప్రసాదంగా పంపిణీ చేయటం కనిపించింది. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి, మరిడి మహాలక్ష్మి అమ్మవారు, వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు, శ్రీ వేంకటేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, సీతారామాంజనేయ స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు జరిగాయి. పట్టణ శివారు కే కంద్రికలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో, పల్లగిరి గుట్టపై త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇదే కొండపై శివలింగం వద్ద భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, అంబారుపేటలోని శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని గోళ్ళమూడి, రాఘవాపురం, మాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, వివిధ రాశులకు చెందిన వారికి ఈ ఏడాది ఎలా ఉంటుందనే అంశాలపై పంచాంగం చదివి వినిపించారు. ఇంటిల్లిపాదీ సంప్రదాయ బద్ధంగా ఉగాది పచ్చడిని రుచి చూశారు.

పెనుగంచిప్రోలు: నూతన సంవత్సరం అమ్మవారు అందరికీ సుభాలు కలిగించాలని శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు అన్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆలయంలో వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆంజనేయశర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఈఏడాది క్రోధి నామ సంవత్సరంలో సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ మాజీ ప్రధానార్చకుడు మర్రెబోయిన గోపాలరావు తండ్రి గోపదాసు, శ్రీధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి చెందిన పరాంకుశం అచ్యుతాచార్యులు, గ్రామ పురోహితులు భైరవబొట్ల నరసింహామూర్తితో పాటు ఆలయానికి ధన, వస్తు రూపేణా వివిధ సేవలందిస్తున్న విశ్రాంత ఆలయ ఉద్యోగి నల్లూరి వెంకటేశ్వరరావు, ఆలయంలో నిర్వహించే హుండీల లెక్కింపు, క్యూలైన్ల నిర్వహణతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పరిటాలకు చెందిన శ్రీదుర్గా శివ సాయి సేవాసంఘం వారిని ఉగాది పురస్కారాలతో సత్కరించారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కంద్రికలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు



తిరుమలగిరిలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వేదాద్రిలో అన్నదానం ప్రారంభిస్తున్న ఈవో హేమలతా దేవి

వత్సవాయి: ఉగాది పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించుకున్నారు. పండగ రోజు కొత్త వ్యాపారాలు ప్రారంభించడంతో పాలు కొత్త నిర్ణయాలను తీసుకున్నారు. రైతులు తాము పండించిన పంటలో మొదటి భాగాన్ని తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు కొత్త వ్యవసాయ పనులు ప్రారంభించుకున్నారు. ఆలయాల వద్ద పంచాగ శ్రవణాన్ని నిర్వహించారు. ఏ రాశి వారికి ఎలా ఉంది.. వచ్చే సీజన్ వ్యవసాయానికి ఎలా ఉంది, ఏ పంటలు బాగా పండుతాయో వంటివి పండితులు చదివి ప్రజలకు వినిపించారు.

రసమయి ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేట అర్బన్: క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు పట్టణంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు ఉగాది పండుగ ప్రాశస్త్యాన్ని వివరించి పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ పద్మా సుందరావు, మరొక అతిథి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా స్విమ్మర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోగుశెట్టి మహేష్ మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు తూములూరి ప్రసాద్‌బాబు, దేశపోగు రామయ్య, అద్దంకి సుధాకర్, దామాల రాణి, భీమాల కృష్ణ తదితరులు తమ కవితా గానాన్ని వినిపించారు. పాల్గొన్న కవులందరినీ సత్కరించి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన 9వ అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొని 6 బంగారు పతకాలను సాధించిన పట్టణానికి చెందిన చిట్యాల మోహన్ (ఏనుపాదం)ను రసమయి సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది రమేష్, బీడీసీలు మల్లికా, రాము, సత్యావతి, సాహిత్యాభిమానులు కోట ప్రభుజీరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో..

కంచికచర్ల : క్రోధి నామ సంవత్సరాది సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ముందుగా పంచాంగ శ్రవణం చదివారు. కార్యక్రమం పట్టణ పార్టీ కన్వీనర్ వేమా సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. పార్టీ కన్వీనర్ సురేష్‌బాబు కంచికచర్ల పట్టణ ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగాను, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును ఎమ్మెల్యేగాని గెలవాలని పూజలు చేశారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రంశెట్టి బాలయ్య, ఉప్పు స్వామి, గ్రంధి ఆదిత్య, పలువురు పాల్గొన్నారు.

వీరులపాడు: క్రోధి నామ సంవత్సరాది పండుగ తెలుగు ప్రజలకు సుఖ సంతోషాలను ఆయురారోగ్యాలను అందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం కార్యక్రమం చేశారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, సర్పంచి రమావత్ కోటి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: క్రోధి నామ సంవత్సరాది సందర్భంగా మండలంలోని తిరుమలగిరి, వేదాద్రి గ్రామాల్లో వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి, యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొలి పండుగ ఉగాది కావటంతో ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించారు. వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావటంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిత్యాన్నదానానికి వత్సవాయి మండలం వేములనర్వ గ్రామానికి చెందిన రాచబండి పురుషోత్తమరావు దంపతులు రూ.51,116 ఆలయ ఏసీ సాంబశివరావుకు అందజేశారు. పండుగ ఒక్క రోజే స్వామి వారి దర్శనం ద్వారా రూ.1,90,150, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2,43,775, నిత్యాన్నదాన విరాళాల ద్వారా రూ.1,64,696, వాహన పూజల ద్వారా రూ.22,560 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించి వేద పండితులను సత్కరించారు. ఆలయ చైర్మన్ భరద్వాజ్, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేదాద్రిలో..యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాన్ని ఉగాది సందర్భంగా పలు రకాల పూలతో అలంకరించారు. ఆలయ ఈవో హేమలతా దేవి భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణంతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బలుసుపాడు గురుధాంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం



పేటలో సత్కారం పొందినవారితో రసమయి సాహితీ సమితి ప్రతినిధులు



పట్టణంలోని వాసవీ అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం



కంచికచర్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు

జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలి

ఎమ్మెల్సీ అరుణకుమార్, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: క్రోధి నామ సంవత్సరం రాష్ట్ర ప్రజలకు శుభాలు అందించాలని శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, మరో సోదరుడు డాక్టర్ మొండితోక కృష్ణప్రసాద్‌లతో కలిసి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు గణపతి పూజ, తదితర పూజలు చేశారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం చేసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు పండుగలలో ప్రథమ పండుగన్నారు. ఉగాది పండుగ తెలుగు ప్రజల జీవితాలలో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పారు. పార్టీ నాయకులు చల్లా బ్రహ్మేశ్వరరావు, దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, గరికపాటి భాస్కరం, ఈశ్వరప్రగడ రంగారావు, సూరె రామారావు, షేక్ కరిముల్లా, గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఓర్సు జ్వాలా, బండారు గంగమ్మ, యాకుబ్ అలీ, కరి రవీంద్ర, పీఎల్ నరసింహారావు, కొమ్ము విజయరాజు, పరిశ మల్లికార్జునరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. చందర్లపాడు గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోకఅరుణకుమార్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉగాది పండుగను నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు కందుల నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామలో ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో వక్తలు



జగ్గయ్యపేట అర్బన్: క్రీడల వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. క్రిస్టియన్‌పేటలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రికెట్ గ్రౌండ్‌లో మాల మహానాడు వారు పట్టణ స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడలు నిర్వహించారని, తద్వారా ప్రతిభ ఉండి గుర్తింపునకు నోచుకోని ఎందరో క్రీడాకారులను గుర్తించి లక్షలాది రూపాయలు బహుమతులు అందజేశారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా మాట్లాడుతూ స్థానికంగా ఎమ్మెల్యే ఉదయభాను కూడా క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 14న అంబేడ్కర్ జయంతి రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్, ప్రముఖ న్యాయవాది ఈవీ.జగన్నాధరావు, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్లు నంబూరి రవి, అల్లూరి భాస్కర్, పార్టీ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు గోగుల వెంకయ్య, రుంజ నాగ యూత్ సభ్యులు, మాలమహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రవికిరణ్

వత్సవాయి: మండల పరిధిలోని పోలింగ్ బూత్‌లను ఏసీపీ రవికిరణ్ మంగళవారం పరిశీలించారు. మక్కపేట, భీమవరం, కన్నెవీడు, ఇందుగపల్లి, రామచంద్రాపురం, పెద్దమోదుగపల్లి, చిన్న మోదుగపల్లి, మంగొల్లు, దేచుపాలెం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌లలో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఓట్లు వేసేందుకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ సిబ్బందికి వివరించారు. పోలింగ్ బూత్‌లలో ఇంకా కల్పించాల్సిన ఏర్పాట్లు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎస్‌ఐ బి.అభిమన్యు ఆయన వెంట ఉన్నారు.


పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు నందిగామ ఏసీపీ బి.రవికిరణ్ తెలిపారు. మంగళవారం మండలంలో తోటచర్ల, నవాబుపేట, ముండ్లపాడు, పెనుగంచిప్రోలు, లింగగూడెం గ్రామాల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎస్‌ఐ పి.రాంబాబుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

గౌరవరం(జగ్గయ్యపేట): కొద్ది రోజుల్లో జరిగే ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నందిగామ ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం రాత్రి ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటేయాలన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రౌడీషీటర్లపై బైండోవర్ కేసులతో పాటు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ జానకిరామ్, ఎస్‌ఐ సతీష్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సొంత వాహనంతో స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పట్టణంలోని మినీ బైపాస్ రోడ్‌లో మున్సిపల్ పార్కు పక్కన నూతనంగా నిర్మించిన జగ్గయ్యపేట కారు స్టాండ్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్న వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి ఏటా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,296 కోట్లు అందించినట్లు తెలిపారు. ఇంతటి సహాయాన్ని అందిస్తున్న మన ముఖ్యమంత్రి జగనన్నకు అందరూ అండగా నిలవాలని కోరారు. ట్యాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పరిటాల భాస్కరరావు, మంచంశెట్టి అప్పారావు, కరిసె రమేష్, షేక్ సిరాజుద్దీన్, అన్నె రామారావు, పిల్లలమర్రి రాంబాబు, మహ్మద్ ఈసూబ్ తదితరులు పాల్గొన్నారు.



కార్ స్టాండ్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కమ్యూనిస్టు నేత సీఆర్‌కు నివాళి

తిరువూరు: కమ్యూనిస్టు యోధుడు చండ్ర రాజేశ్వరరావు (సీఆర్) వర్ధంతిని తిరువూరు సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి, పటిష్టతకు చండ్ర చేసిన సేవలను పార్టీ జిల్లా శాఖ మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య వివరించారు. తిరువూరు ప్రాంతంతో రాజేశ్వరరావు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ పట్టణ కార్యదర్శి మాల పాటి ఉదయ్, నియోజకవర్గ కార్యదర్శి నాగుల్‌మీరా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుబానీ, ఏఐటీయూసీ అధ్యక్షుడు మీరా పూలమాల వేసి నివాళులర్పించారు.



సీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ పేద ప్రజలకు సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుకు రావాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయేల్ ఆధ్వర్యంలో 60వ డివిజన్ వాంబేకాలనీలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ..రంజాన్ మాసంలో నిరుపేద ప్రజలకు సాయం చేస్తే ఆ అల్లాహ్ 70 రెట్లు అధిక పుణ్యాన్ని ప్రసాదిస్తాడని చెప్పారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ముస్లింలు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ నాయకులు ఎండీ రఫీ, నాగూర్, షేక్ షేర్ అలీ, షేక్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అకౌంటెంట్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: ఓ స్కూల్ అకౌంటెంట్‌ను బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సెయింట్ జేవియర్ పాఠశాలలో జ్యోతి అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్కూల్ ఫీజు చెల్లించాలని సదరు విద్యార్థి తండ్రి కొప్పనాతి వెంకటేశ్వరరావును ఈనెల 8వ తేదీన ఆమె కోరింది. దీనిపై ఆగ్రహించిన వెంకటేశ్వరరావు ఆమెతో దురుసుగా మాట్లాడటంతో పాటు ఆమెపైకి దూసుకు వెళ్లి నీ అంతు చూస్తానని బెదిరించాడు. భయపడిన జ్యోతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ఎ.కొండూరు: మండలంలోని కోమటికుంట గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు కోమటికుంట గ్రామంలో కోడిపందేల శిబిరంపై దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడికత్తులు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.